క్లుప్తంగా

సాదాసీదాగా కోదాడ మున్సిపల్ సమావేశం

కోదాడ : మున్సిపాలిటీ సమావేశ మందిరంలో శనివారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కౌన్సిలర్లు వివిధ అంశాలపై చర్చించారు. ఎజెండాలో మొత్తం 14 అంశాలు ఉండగా 12 అంశాలపై చర్చించి రెండు అంశాలను వచ్చే సమావేశానికి వాయిదా వేశారు. ఈ సమావేశంలో కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి మైక్ సెట్ బహూకరణ



మైక్ సెట్ అందజేస్తున్న క్రాంతికుమార్

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్న అంగన్‌వాడీ కేంద్రం- 2కు మాజీ సర్పంచ్, క్రాంతినికేతన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సుంకరి క్రాంతికుమార్ శనివారం మైక్ సెట్ బహూకరించారు. వల్లంశెట్ల లచ్చయ్య, సుంకరి శ్రీరామ్మూర్తి, అంగన్‌వాడీ టీచర్ మర్రి సైదమ్మ, ఆయా కౌసల్య తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని జాన్‌పహాడ్ రోడ్డు విస్తరణలో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్లను మారుస్తున్నందున నేరేడుచర్ల టౌన్- 1 ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ పందిని శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ కెమెరా దినోత్సవం



ఫొటోగ్రాఫర్లను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : నేరేడుచర్లలో జాతీయ కెమెరా దినోత్సవాన్ని శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు దశాబ్దాలుగా కెమెరామెన్ వృత్తిలో ఉన్న కురువేళ్ల రవి, శ్రీనివాస్‌రెడ్డి, మహేష్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, డిస్ట్రిక్ చైర్మన్ బట్టు మధు, ప్రధాన కార్యదర్శి జిలకర రామస్వామి, కందిబండ శ్రీనివాస్, గుండా సత్యనారాయణ, రాచకొండ శ్రీనివాస్, నీలా శ్రీనివాస్, గున్‌రెడ్డి, సైదిరెడ్డి ఉన్నారు.

నోట్‌బుక్స్ అందజేత



నోట్ బుక్స్ అందజేస్తున్న బట్టు మధు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రిటైర్డు ఉపాధ్యాయుడు జి.వీరారెడ్డి అందించిన రూ.3 వేల విలువ గల నోట్ బుక్స్‌ను ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.వీరబాబు, ఎం.జానకిరాములు, నాగమణి, హుస్సేన్, వెంకటేశ్వర్లు, రామ్మూర్తి, బికోజీ, బాలు, సైదులు, రహీద్‌ఖాన్, శౌరీ, వెంకటేశ్వర్‌రావు, అన్నపూర్ణ, నరసింహరావు, మాధవి, యాదగిరి, కృష్ణప్రసాద్, లాల్, విజయలక్ష్మి, సరస్వతి ఉన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తి

నడిగూడెం : మండల పరిధిలోని 15 గ్రామాల్లోని 20 ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తయినట్లు ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్ తెలిపారు. శనివారం నడిగూడెం మండలంలోని అన్ని గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట పీఆర్ ఏఈ రంగారావు, ప్రధానోపాధ్యాయుడు ఉన్నారు.

బదిలీపై వెళ్లిన ఉద్యోగికి సన్మానం



ఉదయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

గరిడేపల్లి : మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామంలో గల బ్యాంక్ ఆఫ్ బరోడాలో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ మేనేజర్ నిగిడాల ఉదయ్‌కుమార్ బదిలీపై వెళ్లారు. శనివారం బ్యాంక్ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మేడబోయిన శ్రీకాంత్, సీహెచ్. సాయి, రఘు, అసిస్టెంట్ మేనేజర్ రంజిత్, శ్రీనివాసరావు, నాగేంద్రబాబు, రామాంజిగౌడ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మట్టి రోడ్లకు మహర్దశ



త్వరలో బీటీగా మారనున్న చిలుకూరు- జానకీ నగర్ రోడ్డు

- లింకు రోడ్లను బీటీగా మార్చేందుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు
- వంతెనల నిర్మాణానికి సైతం..
- తీరనున్న వాహనదారుల తిప్పలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

చిలుకూరు : మండలంలో పలు లింకు రోడ్లకు మోక్షం లభించింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సహకారంతో ఆయా రోడ్లకు ఆర్‌అండ్‌బీ నుంచి నిధులు మంజూరయ్యాయి. చిలుకూరు మండల కేంద్రంలోని జానకీనగర్ స్టేజీ మిల్లు (కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారి) నుంచి జానకీనగర్ గ్రామం వరకు 1.2 కిలోమీటర్ల బీటీ రోడ్డుకు రూ. 1.8 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఈ రోడ్డు అధ్వానంగా ఉండడంతో రోడ్డుపై పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు వేస్తే వారికి తిప్పలు తప్పనున్నాయి. అదేవిధంగా చెన్నారిగూడెం నుంచి మునగాల మండలం గణపవరం వరకు 2.6 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ. 1.53 కోట్లు మంజూరు అయ్యాయి. అలాగే నారాయణపురం గ్రామం నుంచి కోదాడ మండలం తొగర్రాయి వరకు 3.1 కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మించేందుకు రూ. 1.44 కోట్లు నిధులు మంజూరు చేశారు. చిలుకూరు కాలువ ఒడ్డున గల అభయాంజనేయస్వామి ఆలయం నుంచి రామాపురం (కట్టకమ్మగూడెం) వరకు బీటీ రెన్యూవల్ 3 కిలోమీటర్లు, కల్వర్టుల నిర్మాణానికి గాను రూ. 1.70 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ రోడ్ల నిర్మాణం పూర్తయితే ప్రజలు, వాహనదారులకు అవస్థలు తొలగనున్నాయి.

వంతెనల నిర్మాణానికి..

కాగా, నారాయణపురం నుంచి తొగర్రాయి మధ్యలో నూతన వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ. 1.20 కోట్లు మంజూరు కాగా, సీత్లాతండా నుంచి బూరుగడ్డ మార్గంలో గల వాగుపై నూతన వంతెన నిర్మాణానికి రూ. 1.50 కోట్లు మంజూరయ్యాయి. అలాగే బేతవోలు నుంచి ఆచార్యులగూడెం రోడ్డులో ఇసుక వాగుపై నూతన వంతెన నిర్మాణానికి రూ. 1.50 కోట్లు మంజూరయ్యాయి. ఈ వంతెనల నిర్మాణాలు పూర్తయితే రైతుల ఇబ్బందులు తొలగనున్నాయి. అంతేకాక చిలుకూరు నుంచి దూదియాతండా, సీతారాంపురం స్టేజీ నుంచి నారాయణపురం వరకు బీటీ రోడ్డు రెన్యూవల్‌కు గతంలో నిధులు మంజూరు కాగా పనులు చేపట్టకపోవడంతో నిధులు రద్దయ్యాయి. దీంతో తిరిగి ఆ రోడ్డు రెన్యూవల్ చేసేందుకు ప్రతిపాదనలు పంపారు.

అన్ని రోడ్లను బీటీగా మారుస్తాం



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గ పరిధిలోని అన్ని లింకు రోడ్లను బీటీగా మార్చేందుకు కృషి చేస్తాం. చిలుకూరు మండలంలో నూతనంగా మూడు లింకు రోడ్లకు, ఒక రోడ్డు బీటీ రెన్యూవల్‌కు, మూడు వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాం. అన్ని రోడ్లను బాగు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

– ఎస్. పద్మావతి, ఎమ్మెల్యే, కోదాడ

కౌలు రైతులకు రైతుభరోసా వర్తింపజేయాలి



హుజూర్‌నగర్ : సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ శ్రీధర్‌రెడ్డి

హుజూర్‌నగర్ : ప్రభుత్వం కౌలు రైతులకు రైతు భరోసా వర్తింపజేయాలని పలువురు రైతులు కోరారు. శనివారం హుజూర్‌నగర్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ఆ సంఘం జనరల్ బాడీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేయబోయే రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయాలు సేకరించగా, ఎక్కువ మంది రైతులు కౌలు రైతులకు రైతు భరోసా వర్తింపజేయాలని కోరారు. పిల్లల చదువు కోసం ఐటీ రిటన్స్ దాఖలు చేసిన 5 ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులు, 10 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు రైతు భరోసా ఇవ్వాలన్నారు. వ్యవసాయేతర, రోడ్లు, కాలువల కిందపోయిన భూములకు, ప్లాట్లు, గ్రామ కంఠం కింద ఉండి పాస్‌పుస్తకాలు ఉన్న భూములపై అధికారులు విచారణ చేపట్టి రైతు భరోసా నిలిపివేయాలని కోరారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ అంజయ్య, ఆడిటర్ అంబేద్కర్, సహాయ వ్యవసాయ సంచాలకులు సంధ్యారాణి, మండల వ్యవసాయ అధికారి స్వర్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు యరగాని శ్రీనివాస్, సంఘ డైరెక్టర్లు రాయల వెంకటేశ్వర్లు, దేవరం మల్లీశ్వరి, ఇందిరాల లక్ష్మి, దుగ్గి బ్రహ్మం, భూక్యా లచ్చిరాంనాయక్, సంఘం సభ్యులు తాటి శేఖర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, గుర్రం వెంకటరెడ్డి, రేపాకుల వెంకన్న, చికాకుల శంకరాచారి, జడ గోపి, రైతులు పాల్గొన్నారు.

సర్వారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో..

గరిడేపల్లి : మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం సర్వారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి పాల్గొని రైతుబంధు పథకం అమలుపై రైతుల అభిప్రాయాలు సేకరించారు. దీంతో ఎక్కువ మంది రైతులు ఐదు ఎకరాల లోపు ఉన్న సన్నకారు రైతులకు రైతు భరోసా పథకం అమలు చేయాలని, ఐటీ రిటర్న్‌ను ప్రామాణికంగా తీసుకోవద్దని రైతులు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రియతమ్‌కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అంజయ్య, సీనియర్ ఇన్‌స్పెక్టర్ చంద్రకళ, అంబేద్కర్, శంబిరెడ్డి, ముత్యాలు, సుధాకర్‌రెడ్డి, గోపయ్య, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు అభిప్రాయ సేకరణ

పాలకవీడు : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ఆదివారం రైతు భరోసా పథకం అమలుపై రైతు అభిప్రాయం సేకరణ చేపట్టనున్నట్లు ఇన్‌చార్జ్ ఏఓ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్వహించబోయే ఈ సమావేశానికి రైతులు తప్పక హాజరై తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు.

తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సేవ చేయడం అభినందనీయం



తమ్మరలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి, నాయకులు

కోదాడరూరల్ : తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, పీసీసీ సభ్యుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. కోదాడ పట్టణానికి చెందిన సజ్జా సూర్యనారాయణ ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని వారి కుటుంబసభ్యులు సజ్జా త్రివేది- హైమావతిలు కోదాడ పట్టణ పరిధిలోని తమ్మర ఉన్నత పాఠశాల, పట్టణంలోని బాలిక ఉన్నత పాఠశాల, రామాలయం, రంగా థియేటర్ సెంటర్‌లో రూ.8 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్లను శనివారం వారు ప్రారంభించి మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థులు, ఆలయానికి వచ్చే భక్తులు తాగు నీటి కోసం ఇబ్బందులు పడకుండా వాటర్ ఫిల్టర్లు ఏర్పాటు చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. సజ్జా సూర్యనారాయణ- సరోజిని, ఏర్నేని వెంకటేశ్వరరావు- శకుంతల పేరు మీద భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు దాతలు తెలిపారు. ఈ సందర్భంగా సరోజిని ఏజెన్సీ ఎదుట పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, మాజీ సర్పంచ్ ఏర్నేని కుసుమ వెంకటరత్నం బాబు, డాక్టర్ సుబ్బారావు, సరోజిని, నరేష్‌కుమార్, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, సత్యబాబు, గుళ్లపల్లి సురేష్, కుదరవల్లి బసవయ్య, సామినేని నరేష్, మోహన్‌రావు, నాగమణి, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

సీఐటీయూ కన్వీనర్‌గా దోసపాటి శ్రీనివాస్



మోతె : సీఐటీయూ మోతె మండల కన్వీనర్‌గా మండల కేంద్రానికి చెందిన దోసపాటి శ్రీనివాస్ నియమితులయ్యారు. శుక్రవారం మోతె మండలంలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామంలో జరిగిన సీఐటీయూ మండల కమిటీ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శనివారం శ్రీనివాస్ స్థానిక విలేకరులతో మాట్లాడారు. తన తోటి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. కార్మికుల హక్కుల సాధనకు పోరాడుతానని ఆయన తెలిపారు.

గ్రామాల అభివృద్ధికే ప్రభుత్వం పెద్దపీట



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు

అనంతగిరి : గ్రామాల అభివృద్ధికే ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు నివేదికలు చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. అనంతగిరి నుంచి చనుపల్లి రోడ్డును డబుల్ లేన్‌గా మార్చేందుకు రూ.20 కోట్ల నిధులు, అమీనాబాద్ - నడిగూడెం రోడ్డుకు రూ.25 కోట్ల నిధులు మంజూరు కాగా పనులు టెండర్ల దశలో ఉన్నట్లు తెలిపారు. అమీనాబాద్ – ఈశ్వరమాదారం రోడ్డులోని హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. అనంతరం ఎంఈఓ సలీం షరీఫ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సహకారంతో ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ ఏఈ కీర్తిరెడ్డి మాట్లాడుతూ.. అనంతగిరి నుంచి చనుపల్లికి ప్రత్యామ్నాయ 33 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌పీ, ఇరిగేషన్ ఏఈలు కె.శ్రీనివాస్, కె.జీవన్‌కుమార్ మాట్లాడుతూ.. శాంతినగర్‌లోని ఉత్తమ్‌పద్మావతిరెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ.5 కోట్ల 30 లక్షలు నిధులు మంజూరు కాగా పనులు టెండర్ దశలో ఉన్నట్లు తెలిపారు. కొత్తగూడెం మేజర్, పాలారం మేజర్, కొమరబండ మేజర్ కాలువలకు లైనింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొణతం ఉమ, అధికారులు, ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్‌ఐ దంపతులకు సన్మానం



ఏఎస్‌ఐ నాగేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న అదనపు ఎస్పీలు నాగేశ్వరరావు, జనార్దన్‌రెడ్డి

మునగాల: మునగాల పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తూ శనివారం ఉద్యోగ విరమణ పొందిన నాగేశ్వరరావు దంపతులను సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాల మేరకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీలు ఎం. నాగేశ్వరరావు, ఆర్. జనార్దన్‌రెడ్డి తదితరులు ఘనంగా సత్కరించారు. పోలీసు శాఖలో 34సంవత్సరాలుగా విధులు నిర్వర్తించిన నాగేశ్వరరావు సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఏఓ మంజుభార్గవి, పోలీసు సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామచందర్‌గౌడ్, సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్, సభ్యులు అంజన్‌రెడ్డి, వెంకయ్య, డీపీఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా కలిసి ఉండాలి



హుజూర్‌నగర్‌రూరల్ : గోపాలపురంలో మాట్లాడుతున్న ఎంపీపీ గూడెపు శ్రీనివాస్

హుజూర్‌నగర్‌రూరల్ : కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలసి ఉండాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ సూచించారు. పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హుజూర్‌నగర్ మండల పరిధిలోని గోపాలపురంలో గల ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చీకూరి రాజారావు, గ్రామ ప్రత్యేకాధికారి, డీటీ కమలాకర్, మాజీ సర్పంచ్ శాసనాల నాగసైదయ్య, ఆర్‌ఐ, కార్యదర్శి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

మునగాల : రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులను ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు అన్నారు. పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మునగాల మండలంలోని నర్సింహులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని దళితవాడలో పౌరహక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, ఆర్‌ఐ రాధారెడ్డి, ఏఎస్‌ఐ కల్లు శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, మహిళా సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దళితులను చిన్నచూపు చూడొద్దు

నడిగూడెం : మండల పరిధిలోని కరివిరాలలో గల ఎస్సీ కాలనీలో శనివారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ.. దళితుల పట్ల చిన్నచూపు చూడవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్, ఆర్‌ఐ గోపాలకృష్ణ, మాజీ సర్పంచ్ గుర్రం నీలిమా గాంధీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



మునగాల : తాడువాయిలో పారిశుద్ధ్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమేష్ దీనదయాళ్

మునగాల : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ కె.రమేష్ దీనదయాళ్ అన్నారు. శనివారం మునగాల మండలంలోని తాడువాయిలో పారిశుద్ధ్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైయినేజీలు, వీధులు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. మలేరియా, డెంగీ జ్వారాలు ప్రబలకుండా పంచాయతీల్లో శానిటేషన్ చేయాలని అన్నారు. గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీశైలం, సిబ్బంది లింగం రామకృష్ణ, లింగయ్య, పంచాయతీ కార్యదర్శి సతీష్, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో దోమల వ్యాప్తిని నివారించాలి

హుజూర్‌నగర్‌రూరల్ : గ్రామాల్లో దోమల వ్యాప్తి నివారణకు నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అన్నారు. హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డలో డెంగీ జ్వర బాధితులను మండల వైద్యాధికారిణి డాక్టర్ పుష్పలతతో కలిసి ఆయన శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించిన ఆయన పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించి డ్రైయినేజీల్లో పేరుకుపోయిన చెత్త, మురుగు నీటిని తొలగింపజేయాలని ఆదేశించారు. గ్రామంలో 30 నుంచి 40 శాతం మంది ప్రజలు విషజ్వరాల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వైద్య శిబిరం ఏర్పాటు చేయించి వైద్య సేవలు అందించాలని చెప్పారు. ఈ సీహెచ్‌ఎన్ పద్మ, కార్యదర్శి గిరిజాకుమారి, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరాజు, విజయ వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిలుకూరులో డ్రై డే

చిలుకూరు : మండల కేంద్రంలోని జేజే నగర్‌లో శనివారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లు, వీధుల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కాలనీవాసులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గిరిబాబు, గ్రామ కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కంఠమహేశ్వరస్వామికి జలాభిషేకం



జలబిందెలతో ఆలయానికి తరలివస్తున్న మహిళలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని లక్కవరంలో కంఠమహేశ్వరస్వామి పండుగను గౌడ కులస్తులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు జలబిందెలతో ఆలయానికి తరలివచ్చి స్వామివారికి జలాభిషేకం చేశారు. స్వామివారికి నైవేద్యం సమర్పించి వర్షాలు సకాలంలో కురవాలని పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్ద గౌడ్ తుమ్మల సైదులగౌడ్, గౌడ కులస్తులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుల పదోన్నతులపై హర్షం

నడిగూడెం : విద్యా శాఖలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతులు కల్పించడం పట్ల వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు పాతకొట్ల ప్రకాష్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం నడిగూడెం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 25 సంవత్సరాలుగా పదోన్నతుల కోసం వ్యాయామ ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారని, ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం వారికి పదోన్నతులు కల్పించడం హర్షనీయమని అన్నారు. ఆయన వెంట కార్యదర్శి డి.నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

అత్యున్నత న్యాయసేవలు అందరికీ అందుబాటులో ఉండాలి

మునగాల : దేశంలోని అన్ని ప్రాంతాలకు అత్యున్నత న్యాయస్థానాలైన సుప్రీంకోర్టు, హైకోర్టు సేవలు అందుబాటులో ఉండేవిధంగా చూడాలని మండలానికి చెందిన ప్రముఖ న్యాయవాది మిర్యాల మంగయ్యగౌడ్ శనివారం దేశప్రధాని మోదీకి ఈమెయిల్ ద్వారా వినతిపత్రం పంపారు. అనంతరం ఆయన మునగాలలో విలేకరులతో మాట్లాడారు. సుప్రీంకోర్టు బెంచ్‌లను రెండు రాష్ట్రాలకు ఒకటి, హైకోర్టు బెంచ్‌లను రెండు జిల్లాలకు ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలని, దీంతో దేశప్రజలందరికి న్యాయ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

డ్రైయినేజీ అస్తవ్యస్తం



చేతి పంపు వద్ద అధ్వానంగా డ్రైయినేజీ

నడిగూడెం : మండలంలోని సిరిపురంలో గల ఎస్సీ కాలనీలో చేతి పంపు వద్ద డ్రైయినేజీ అధ్వానంగా మారింది. ఇళ్లల్లోంచి వచ్చే మురుగు నీరు చేతి పంపు చుట్టూ చేరుతుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు, ఈగల వ్యాప్తి చెందుతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బీటీ రోడ్డు మంజూరు చేయాలి

మునగాల : మండలంలోని ఆకుపాముల గ్రామ పరిధిలోని కిష్టాపురం గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్‌గౌడ్ కోరారు. శనివారం ఆయన కిష్టాపురం రోడ్డును పరిశీలించి మాట్లాడారు. 65వ నెంబర్ జాతీయ రహదారి నుంచి కిష్టాపురం వరకు రోడ్డు అధ్వానంగా తయారై రాకపోకలకు ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి స్పందించి బీటీరోడ్డుకు నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు దొంతగాని నాగేశ్వరరావు, సురగాని పరుశరామ్, సట్టు కోటేశ్వరరావు, అమరబోయిన ఉపేందర్, రాజుల నవీన్, పోలంపల్లి మనీ, పోలంపల్లి పండు పాల్గొన్నారు.

కనకమ్మ మృతి బాధాకరం

మునగాల: మండలంలోని కలకోవ గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు జూకూరి గుర్వయ్య భార్య కనకమ్మ మృతి బాధాకరమని కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు అన్నారు. శనివారం కలకోవలో నిర్వహించిన కనకమ్మ దశదిన కర్మకు ఆయన హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పందిరి నాగిరెడ్డి, సీహెచ్. లక్ష్మీనారాయణరెడ్డి, వంగవేటి రామారావు, బీఆర్‌ఎస్ మండల నాయకులు అజయ్‌కుమార్, సీపీఎం నాయకులు బుర్రి శ్రీరాములు, గుండు లింగారావు, శ్రీనివాస్, సైదులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లపై పనిభారం తగ్గించాలి

గరిడేపల్లి : అంగన్‌వాడీ టీచర్లపై అదనపు పనిభారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా నాయకులు షేక్ యాకూబ్, కందగట్ల అనంత ప్రకాష్ అన్నారు. శనివారం గరిడేపల్లి మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామంలో రాచమళ్ల నాగమణి అధ్యక్షతన కీతవారిగూడెం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్యాస్, కూరగాయాలు టీఏడీఏ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ల కనీస వేతనం రూ. 21వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కీతవారిగూడెం అంగన్‌వాడీ టీచర్స్ సెక్టార్ (సీఐటీయూ అనుబంధ సంఘం) అధ్యక్షురాలిగా రాచమళ్ల నాగమణి, కార్యదర్శిగా వంశీ ప్రియ, ఉపాధ్యక్షురాలిగా మోదాల పద్మ, సహాయ కార్యదర్శిగా ఎం.బుజ్జి, కోశాధికారిగా వై.ఎల్లమ్మలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

యలక సైదులుకు నివాళి

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ పార్టీ నాయకుడు యలక సైదులుగౌడ్ దశదినకర్మ (సంతాప సభ)ను శనివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, వివిధ పార్టీల, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, బంధువులు పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మా భూములను కాపాడండి



పట్టాదారు పాస్ పుస్తకాలు చూపుతున్న బాధిత రైతులు

మునగాల : మండలంలోని ఆకుపాముల గ్రామ రెవెన్యూ పరిధిలోని 137 సర్వే నంబర్ (తుపాకుల బండ)లో గల తమ పట్టా భూములను కొందరు దౌర్జన్యంగా లాక్కునేందుకు యత్నిస్తున్నారని, తమ భూమిని కాపాడి తమకు న్యాయం చేయాలని నర్సింహాపురంనకు చెందిన పలువురు రైతులు కోరారు. శనివారం ఆకుపాములలో భూమి వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. తమ తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూమిని కుటుంబ అవసరాల నిమిత్తం కోదాడకు చెందిన విద్యావేత్త పందిరి నాగిరెడ్డి వద్ద తమ భూమిని తనఖా పెట్టి అప్పు తీసుకున్నామని తెలిపారు. నర్సింహాపురంనకు చెందిన కారింగుల బిక్షం –వెంకమ్మ వృద్ధ దంపతులతో సహా వారి కుటుంబసభ్యులు తమ భూములలో అక్రమంగా ప్రవేశించి సాగుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. 20 రోజుల క్రితం 137 సర్వే నంబర్‌లో ఉన్న భూమిలో ఉన్న గురుకుల పాఠశాల రేకుల గదులను జేసీబీతో కూలగొట్టారని తెలిపారు. నీటి ట్యాంకు, నల్లాలను విరగ్గొట్టారని, పాఠశాల పక్కనే పట్టా భూముల్లోకి ప్రవేశించి సాగుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. తమ భూముల్లోకి ప్రవేశించి దౌర్జన్యం చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

అధిక ఫీజుల వసూళ్లను అరికట్టాలని వినతి

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజుల వసూళ్లను అరికట్టాలని కోరుతూ డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శనివారం కోదాడలో ఎంఈఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బోయిళ్ల నవీన్ మాట్లాడుతూ.. ఇష్టానుసారంగా ఫీజులు పెంచి వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస వసతులు లేవని, ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా పుస్తకాలు, యూనిఫాం అమ్ముతున్నారని ఆరోపించారు. పాఠశాలల పేరుతో వ్యాపారం చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. భావన ఆదినారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బురాం, కమిటీ సభ్యులు ఉన్నారు.

బీసీలకు ఐదు మంత్రి పదవులు ఇవ్వాలి

హుజూర్‌నగర్ : రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో బీసీలకు ఐదు మంత్రి పదవులు ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ కన్వీనర్ ధూళిపాళ ధనుంజయనాయుడు కోరారు. శనివారం హుజూర్‌నగర్‌లోని బీసీ భవన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రివర్గంలో బీసీలకు కేవలం రెండు పదవులు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. నామినేటెడ్, కార్పొరేషన్, ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర సంస్థల చైర్మన్లు, డైరెక్టర్ల పోస్టులలో బీసీలకు 50 శాతం ఇవ్వాలన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ధూళిపాళ శ్రీనివాస్, నాయకులు బి.గోవిందరావు, రాయల వెంకటేశ్వర్లు, చేపూరి నరసింహాచారి, ఎం.వెంకటేశ్వర్లు, ఎం.సత్యనారాయణ, కె.కృష్ణ పాల్గొన్నారు.